# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 328: మనం ఎల్లప్పుడూ మంచిగా, ఆనందంగా ఉండగలమా?
# జులై 13, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి పుస్తకం *Seeking Within*, పేజీలు *3-8* నుండి తీసికొనబడినవి

ప్ర: భగవంతుడు అందరికీ మంచి చేయమని బోధిస్తాడు. నేను చేయగలిగినంత మంచి చేసినా ఇతరులు నన్ను బాధ పెడితే, ఎంత వరకూ మంచి చేయాలి?

స: బాబా మంచి చేయమన్నారని మీరు మంచి చేస్తున్నారు. కానీ ఇతరులు మిమ్మల్ని బాధిస్తున్నారు. ఎంత వరకూ మంచి చేయాలి, అంటే "ఎప్పుడు ఇతరులకు మంచి చేయడం ఆపివేయాలి? నేను ఎంత మంచి చేసినా ఇతరులు తిరిగి మంచిగా ఉండడం లేదు. కనుక ఎప్పుడు మంచి చేయడం ఆపివేయాలి?" ఇది ఆ ప్రశ్న వేసిన వారి అర్థం.

సాయి సాహిత్యంలోంచి మీకు ఒక ఉదాహరణ ఇస్తాను. ఒక పండితుడు నదిలో స్నానం చేస్తున్నాడు. ఆ నీటిలో ఒక తేలు కొట్టుకోవడం కనపడింది. ఈ పండితుడు ఆ తేలుని చేత్తో బయటకు తీసాడు. ఆ తేలు అతనిని కుట్టింది. వెంటనే దానిని నీటిలో వదిలేసాడు. ఆ తేలు మళ్ళీ కొట్టుకోవడం మొదలు పెట్టింది.

దయ తలచి అతను దానిని మళ్ళీ బయటకు తీసాడు. ఆ తేలు అతనిని మళ్ళీ కుట్టింది. అప్పుడు ఆ పండితుడు అనుకున్నాడు, "ఓ తేలా, నీ చెడు బుద్ధి పోనిచ్చుకోలేదు. కానీ నీవు నీ చెడు బుద్ధి పోనిచ్చుకోనంత మాత్రమున నేను నా మంచి బుద్ధిని ఎందుకు వదులుకోవాలి? నీకు సహాయం చేస్తూనే ఉంటాను. ఇదే నీ నుండి నేను నేర్చుకున్న పాఠం. నీ చెడు బుద్ధి పోనిచ్చుకోనంత మాత్రమున నేను నా మంచి బుద్ధిని ఎందుకు వదులుకోవాలి?"

కనుక, ఇతరులు మిమ్మల్ని బాధ పెట్టినా, ఆ తేలు వలె ప్రవర్తించినా, వారు అలా ప్రవర్తించినంత మాత్రమున మీరు వారికి సహాయం చేయడం మానకూడదు. మీరు మీ మంచి బుద్ధితోనే ప్రవర్తించండి. ఉదాహరణకి, మనం సూర్యుడిని చూసి, "ఓ సూర్యుడా, మాకు ప్రకాశం ఇస్తున్నావు, ధన్యవాదాలు," అని చెప్పము, కానీ సూర్యుడు ప్రకాశిస్తూనే ఉంటాడు.

గాంధీ గారికి, విన్స్టన్ చర్చిల్ కి ఎప్పుడూ పడక పోయినా గాంధీ గారు ఆయనతో గౌరవంగానే మాట్లాడే వారు. ఆయన మంచి గుణం వల్ల చర్చిల్ తో ఎప్పుడూ మర్యాదగానే ఉండేవారు. అదే విధంగా సహాయకరమైన బుద్ధి మీ సహజ గుణంగా ఉండాలి.

ఆదివారాలు మాత్రమే సహాయకరంగా ఉంటాను అనుకోవడం పొరపాటు. సేవా గుణం ఒక కార్యక్రమానికి మాత్రమే పరిమితమవకూడదు. అది మీ సహజ బుద్ధిగా ఉండాలి. ఎప్పుడూ సేవా బుద్ధితో ఉండాలి. సోమవారం లేచి, "నేను ఆదివారం వినయంగా ఉంటాను, మంగళవారం సేవ చేస్తాను, బుధవారం సహాయకరంగా ఉంటాను," ఇలా అనుకోకూడదు. జీవితమనేది కార్య నిర్వహణక్రమము దెలుపుపట్టి కాదు.

జీవితం ఒక కాలపట్టి కాదు. సహాయకార బుద్ధి మీ సహజ గుణమై ఉండాలి, ఇంక దేనినీ పట్టించుకోకుండా అదే మీ స్వభావంగా ఉండాలి.

ఈ సందర్భంలో నాకు వుల్ఫ్ అనే పేరు గల ఒక గొప్ప క్రిస్టియన్ మిషనరీ గుర్తుకి వస్తున్నారు. ఆయన ఒక పెద్ద బంగళాలో నివసిస్తున్నారు. కొంత మంది దొంగలు, దోపిడీదారులు ఆయన ఇంట్లో ప్రవేశించి ఉన్నవన్నీ దొంగలించి బంగళా వదిలి పారిపోబోతున్నారు.

అప్పుడు రెవరెండ్ వుల్ఫ్ మంచం నుండి లేచి, ఆ దొంగలు పారిపోతుండడం గమనించి, గట్టిగా అరిచారు, "ఆగండి! అక్కడ అంతా చీకటిగా ఉంది బాబూ. ముళ్ళ కంచెలు, పాములు, తేళ్ళు ఉంటాయి. మీకు ఒక దీపం ఇస్తాను. అది తీసుకొని జాగ్రత్తగా వెళ్ళండి. మీరు మరణిస్తే నేను ఓర్వలేను." అదీ సహజమైన సహాయకార గుణమంటే.

టాల్స్టాయ్ సాహిత్యంలో కూడా ఒక కథ గుర్తుకి వస్తోంది. ఒక దుర్మార్గుడు, గూండా, చెడు వ్యసనాలు గలవాడు, వాడి ఆస్తి అంతా పోగొట్టుకున్నాడు. చివరికి అతని కాబోయే భార్య అతని తల్లి యొక్క బంగారు గొలుసు కావాలంది. వాడు తప్ప తాగి, తల్లిని చంపి, ఆమె మెడలోని బంగారు గొలుసుని లాక్కున్నాడు. కాబోయే భార్యకు దానిని ఇవ్వడానికి బయలుదేరబోతున్నాడు.

అప్పుడు అతనికి ఒక గొంతు వినపడింది. "అబ్బాయ్, జాగ్రత్త! తప్ప తాగి ఉన్నావు బాబు, పడిపోతావేమో, అడుగు జాగ్రత్త. ఆ బంగారు గొలుసు భద్రంగా తీసికెళ్ళు." వాడు వెనక్కి తిరిగి చూసాడు. తల్లి గుండె నేల మీద పడి ఉండడం చూసాడు. ఆ హృదయం మాట్లాడుతోంది, "బాబు, పడిపోతావేమో జాగ్రత్త. గొలుసు భద్రం!" అని. అదే ప్రేమ అంటే.

"నువ్వు నాకు సహాయం చేస్తే నేను నీకు సహాయం చేస్తాను," అనేది వ్యాపారం, రాజకీయం. "నువ్వు నన్ను బాధ పెట్టినా నేను నీకు సహాయం చేస్తాను," అనేది నిజమైన సహాయం.

ప్ర: ఈనాడు నేను అన్నిటినీ అంగీకరించ గలుగుతున్నాను. కానీ అప్రియమైన వాటిని కూడా ఎలా అంగీకరించాలి?

స: ఇది ఎక్కువగా అడగబడే ప్రశ్న. అప్రియమైన వాటిని ఎలా స్వీకరించాలి? మీరు పొద్దున ఒక మూడు గంటలు, సాయంత్రం ఒక మూడు గంటలు అక్కడ కూర్చోవడం సులభం కాదు. మీ మోకాళ్ళు తెలియచేస్తాయి అది ఎంత కష్టమో. మీ నడుము నొప్పి తెలియచేస్తుంది అది ఎంత కష్టమో. చాలా కష్టం. కానీ కష్టం, సుఖం మీ స్వభావం, మీ భావం పై ఆధార పడి ఉంటుంది. అది మానసికమైనది. మనసుతో సంబంధించినది.

ఉదాహరణకి, జపాను దేశపు వారిని తీసుకుంటే, వారు ఒక పిండి మిల్లు వలె పని చేస్తారు. వారి దేశము కూలిపోయినా వారు శాస్త్రం, సాంకేతిక విజ్ఞానం వంటి రంగాలలో మళ్ళీ పైకి వచ్చారు. హిరోషిమా పై బాంబు పడి బూడిద అయిపోయినా (హిరోషిమా, నాగసాకి అనే పట్టణాల గురించి మీరు వినే ఉంటారు), ఈనాడు హిరోషిమా ఒక అందమైన పట్టణముగా రూపొందింది. ఆ బొగ్గులలోనుండి వారు ఒక అందమైన పట్టణాన్ని రూపు దిద్దారు.

అది స్వభావం. అప్రియమైన వాటిని ప్రియంగా చేసుకోగలిగితే నేను విజయవంతుడిని అయ్యానని తలుస్తాను. అది గెలుపు! చిన్న ఉదాహరణ: నేను ఒక పొగ త్రాగేవాడిని. (నిజానికి కాదు, ఉదాహరణకి). ఎవరైనా వచ్చి, “పొగ తాగవద్దు,” అంటే అది నాకు అప్రియంగా ఉంటుంది. కానీ పొగ తాగడం మానివేయ గలిగితే నేను జయించినట్టే. ఒక తాగుబోతు మద్యం తాగడం మానివేస్తే అతడు విజయవంతుడే! కనుక అప్రియమైన వాటిని ప్రియంగా మార్చుకో గలిగితే అందులోనే గెలుపు ఉంది. అదే సాధన.

సాధన అనగా అప్రియమైన వాటిని ప్రియంగా మార్చుకో గలగడమే. ఒకొక్కసారి మన జీవితాలలో కొన్ని సంఘటనలు ఘోరమైనవిగా, అసమ్మతమైనవిగా కనిపిస్తాయి. ఉదాహరణకి, మన కుటుంబములో ఎవరైనా చనిపోయినా, సొమ్ము పోయినా, ఉద్యోగం పోయినా, చుట్టాలు దూరమైనా, ఇంకేదైనా కష్టము వచ్చినా, ఇటువంటివి చాలా కష్టమైనవి, అప్రియమైనటువంటివి. కానీ ఆధ్యాత్మిక దృష్టితో చూడగలిగి, భగవంతునిపై నమ్మకముతో, దైవ శక్తితో వాటిని అంగీకరించగలిగితే అప్పుడు మీరు విజయవంతులు అవుతారు. కానీ కష్టమైన సంఘటనలు అప్రియంగా, కష్టంగా భావిస్తే మీరు ఓడిన వారౌతారు. జీవితమనే ఆటలో ఓడిపోయినట్లే. దీని మీదే మీ జయాపజయాలు ఆధార పడి ఉంటాయి.

ఒక చిన్న ఉదాహరణ: మీరు చట్ట ప్రకారంగా వారసులనుకోండి. అప్పుడు న్యాయంగా మీరు రాజు అవ్వచ్చు. కానీ ఆ రాజ్యాన్ని వదిలేసి వనవాసానికి వెళ్ళగలిగితే మీరు గెలిచిన వారౌతారు. అదే శ్రీ రామచంద్రమూర్తి చేసినది. అయోధ్య రాజ్యానికి వారసుడైనా, రాజ్యం వదిలేసి వనవాసానికి బయలుదేరాడు. అందువల్లే మహానుభావుడు అయ్యాడు. ఒక రాజు రాజ్యం వదిలేసి వనవాసమునకు వెళ్ళడం సులభమైనది కాదు. కానీ అటువంటి అప్రియమైనది, కష్టమైన దానిని కూడా ప్రియంగా చేసుకోగలిగాడు. అందువల్లే తరతరాలకి పరాక్రమవంతుడిగా మిగిలిపోయాడు.

కనుక మీ విజయము అప్రియమైన వాటిని కొంత ప్రయత్నముతో ప్రియంగా మార్చుకొనే దానిపై ఆధార పడి ఉంది. ఇది భగవంతుని పై నమ్మకముంటేనే సాధ్యం. భగవంతునిపై విశ్వాసముంటే అప్రియమైనవి కూడా అంగీకరింపదగినవిగా మారిపోతాయి.

“దేవుడు ఇదెందుకు చేసాడు?” అని అడుగకు. “భగవంతుడా, నాకు దీనిని భరించ గలిగే శక్తిని ప్రసాదించు, ధైర్యాన్ని ప్రసాదించు,” అని కోరుకో.

**ప్ర: చెడు భావనలు, చెడు తలపులు, చెడు అలవాట్లు ఎవరి నుంచి, ఎప్పుడు మొదలౌతాయి?**

స: పసిపిల్లలు అమాయకులు. అమాయకత్వం దివ్యత్వం. కానీ అ బిడ్డ పెద్దయ్యే కొద్దీ ఆ అమాయకత్వము అహం భావముగా అభివృద్ధి చెంది, అజ్ఞానంగా మారిపోతుంది. పిల్లవాడు తన తలిదండ్రులు, చుట్టుప్రక్కలు, తర్వాత బడి, స్నేహితులు, సమాజము, వీటి ద్వారా అహం భావమును అభివృద్ధి చేసుకుంటాడు.

ఆ తర్వాత స్వానుభావాల ద్వారా తను అజ్ఞాని అని తెలుసుకుంటాడు. సాధారణముగా ఏదైనా కష్టమొచ్చినప్పుడో, కుటుంబంలో ఎవరైనా చనిపోయినప్పుడో, అనారోగ్యం వల్లనో, లేక జీవితంలో అసంతృప్తి వల్లనో ఇలా జరుగుతుంది.

అప్పుడు అర్థం చేసుకుంటాడు తను ప్రేమించినవి సత్యము కాదు, తను ఆనందిస్తున్నవి నిత్యం కాదు, తను కోరుకున్నవి విలువైనవి కాదు అని. అప్పుడు ఏది మంచి, ఏది చెడు అని విచారణ మొదలు పెడతాడు.

అటువంటి సమయంలో చాలా మంది జీవితాలలోకి ఒక గురువు వస్తాడు, లేకుంటే ఉన్న గురువుతో సంబంధం ఏర్పడుతుంది. నీ కోరికలు, నీ మనసు అనుభవించవలసిన సత్యాలు కాదని తెలుసుకున్న తర్వాత ఆ గురువు నిన్ను తన వద్దకు త్రిప్పుకుంటాడు.

మన అందరికీ దయ, ప్రేమ, ఆనందం, ఐక్యం, శాంతం వంటివి అనుభవించాలని కోరుకుంటాం. దానికి మనం ఇష్టపూర్వకంగా ఉంటే గురువు మనకి మార్గం చూపిస్తాడు.

ప్రతి మానవుడు పూర్వ జన్మల కర్మల మూలంగా కొన్ని మంచి, కొన్ని చెడు  సంస్కారాలతో జన్మిస్తాడని భారతీయ సంస్కృతి చెబుతుంది. వాటి ప్రభావము ఆ మానవుని ప్రస్తుత జన్మలో కనబడతాయి.

వచ్చే వారం ప్రొ. అనిల్ కుమార్ గారు మరింత విజ్ఞానంతో మళ్ళీ కలుస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్